# బీసీ డిక్లరేషన్ పెద్ద బూటకం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్

- బీసీలను కడుపులో పెట్టుకొని కాపాడుకున్న ఘనత బీఆర్ఎస్‌దే
- డిక్లరేషన్లకు కట్టుబడే సంస్కృతి కాంగ్రెస్‌కు లేదు
- వారి పాలనలో బీసీలకు అవమానం
- ఉమ్మడి జిల్లాలో ఒక్కరికీ టికెట్ ఇవ్వలేదు
- రేవంత్‌కు కామారెడ్డిలో డిపాజిట్ కూడా కష్టమే
- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 11: కామారెడ్డిలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య సమక్షంలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ఒక పెద్ద బూటకమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ధ్వజమెత్తారు. బీసీలమీద ఇంతకాలం లేని ప్రేమ ఎన్నికలు రాగానే గుర్తుకువచ్చిందా అని ఎద్దేవా చేసారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశాన్ని అధిక కాలం పాలించిన కాంగ్రెస్.. బీసీలకు ఏనాడూ ప్రాధాన్యత ఇవ్వలేదని, ఇప్పుడు బీసీల సంక్షేమం గురించి మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. ఉమ్మడి జిల్లాలో ఒకప్పుడు కాంగ్రెస్ నుంచి నలుగురైదుగురు బీసీ ఎమ్మెల్యేలు ఉండేవారని, ఈసారి కనీసం ఒక్క బీసీకి కూడా టికెట్ ఇవ్వకుండా రేటెంతరెడ్డి అమ్ముకున్నాడని ఆరోపించారు. బీసీ నాయకత్వాన్ని అణిచివేస్తున్న హస్తం పార్టీ డిక్లరేషన్ల పేరిట ఎన్ని డ్రామాలాడినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. కాంగ్రెస్ నాయకులకు దోచుకోవడం.. దాచుకోవడంతోనే సరిపోయిందనిన్నారు. డిక్లరేషన్లకు కట్టుబడే సంస్కృతి వారికి లేదన్నారు. పార్టీ డిక్లరేషన్లనే పాటించనివారు.. ప్రజలకు సంబంధించిన డిక్లరేషన్లను అమలుచేస్తామంటే ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. బీసీ నాయకులు లేకుండానే బీసీ డిక్లరేషన్ ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పరిస్థితి దయనీయంగా మారిందని, నాలుగు స్థానాల్లో స్థానికేతరులకే టికెట్లను అమ్ముకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాన్సువాడలో ఏండ్లతరబడి పార్టీలో కష్టపడుతున్న కాసుల బాలరాజ్‌కు టికెట్ ఇవ్వలేదని గుర్తుచేశారు. రూ. వెయ్యికోట్లతో కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, బీసీలను కడుపులో పెట్టుకొని కాపాడుకున్న ఘనత కేసీఆర్‌దేనన్నారు.

గ్యారంటీల పేరిట ప్రజలను మోసం చేసి ఓట్లు దండుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదని జాజాల అన్నారు. కర్ణాటక ప్రజలను ఇలాగే వంచించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. మరోసారి తెలంగాణను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నదని అన్నారు. ఇక్కడి ప్రజలు మోసపోవద్దని, అభివృద్ధి కాంక్షించే బీఆర్ఎస్ ప్రభుత్వానికే ఓటు వేయాలని కర్ణాటక రైతులు తెలంగాణకు వచ్చి ప్రచారం చేస్తున్నారని గుర్తుచేశారు. అయినా కాంగ్రెస్‌కు సిగ్గురావడం లేదన్నారు. కామారెడ్డి నుంచి పోటీచేస్తున్న పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి కనీసం డిపాజిట్ కూడా దక్కదన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, నాగిరెడ్డిపేట్ జడ్పీటీసీ ఉమ్మన్నగారి మనోహర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ ఏగుల నర్సింహులు, మార్కెట్ కమిటీ చైర్మన్ కాశీనారాయణ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఆదిమూలం సతీశ్‌కుమార్, నాయకులు ప్యాలాల రాములు, దుద్దుల సాయిరాం, బాల్‌రెడ్డి, శివ, ఇమ్రాన్. నాగం సురేందర్, గాదె తిరుపతి, నాగం రాజయ్య, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కవితను గజమాలతో సన్మానిస్తున్న గోసంగి కులస్తులు

## కాంగ్రెస్ అహంకారానికి అడ్డూ అదుపు లేదు

- బీసీల సీట్లను కోట్లకు అమ్ముకున్నది
- పీసీసీ చీఫ్ రేవంత్.. రేటెంత రెడ్డిగా మారాడు
- కేసీఆర్‌పై పోటీతో ఈటల, రేవంత్‌కు వాతలే
- గోసంగి ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఖలీల్‌వాడి, నవంబర్ 11: బీసీల సీట్లను కాంగ్రెస్ పార్టీ కోట్లకు అమ్ముకొని అగ్రవర్ణాలకు కట్టబెట్టిందని ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. సీట్లు అమ్ముకొని రేవంత్ రెడ్డి పేరును రేటెంత రెడ్డిగా మార్చుకున్నారని ఎద్దేవా చేశారు. రైతుబంధును రైతులకు వేస్తున్న భిక్షమంటూ రేవంత్‌రెడ్డి అంటున్నారని, కాంగ్రెస్ నాయకుల అహంకారానికి అడ్డూ అదుపు లేకుండా పోతున్నదని, అధికారంలో లేనప్పుడే ఇంత అహంకారాన్ని ప్రదర్శిస్తుంటే పొరపాటున అధికారంలోకి వస్తే ఆ పార్టీ నేతల పనులు ఎలా ఉంటాయో ఆలోచించాలని కోరారు. కామారెడ్డిలో ఖాళీ కుర్చీలనుద్దేశించి రేవంత్ ప్రసంగించారని చెప్పారు. కాంగ్రెస్ పాలనపై కర్ణాటక ప్రజలు దుమ్మెతిపోస్తుంటే ఆ సీఎం ఇక్కడికొచ్చి ఏవేవో చెబుతున్నారని విమర్శించారు. నగరంలో ఆదివారం జరిగిన గోసంగి కుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ కవిత ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని 8జనరల్ సీట్లకు గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీసీలకు నాలుగు స్థానాలు కేటాయించిందని, ఈసారి ఒక్క సీటు కూడా ఇవ్వలేదని తెలిపారు. బీసీల సీట్లను కోట్ల రూపాయలకు అమ్ముకొని అగ్రవర్ణాలకు అప్పగించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. జిల్లా బీసీలకు ఒక్క సీటూ ఇవ్వకుండా బీసీ డిక్లరేషన్ చేయడం హాస్యాస్పదంగా ఉన్నదన్నారు. రేవంత్‌రెడ్డి కామారెడ్డికి వచ్చి కాలు దువ్వుతున్నారని, కేసీఆర్ సీఎం కాబట్టి రకరకాల వ్యూహాలతో రెండు చోట్లా పోటీచేస్తున్నారని, పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లుగా ఈటల రాజేందర్, రేవంత్‌రెడ్డి రెండుచోట్లా పోటీకి దిగారని, వారికి వాతలే మిగులుతాయన్నారు. కర్ణాటక ప్రజలు అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తుంటే ఆ రాష్ట్ర సీఎం సిద్ధరామయ్య తెలంగాణకు వచ్చి బీసీలకు అవి చేస్తామని, ఇవి చేస్తామని చెబుతున్నారని విమర్శించారు. దళితుల కోసం అమలు చేస్తున్న అన్ని పథకాలూ గోసంగి కులస్తులకు అందుతాయని తెలిపారు.

**బీడీ కార్మికులందరికీ పింఛన్లు..**

ఎన్నికల తర్వాత కటాఫ్ డేట్‌ను పొడిగించి బీడీ కార్మికులందరికీ పింఛన్లు అందేలా సీఎం కేసీఆర్ చర్యలు తీసుకుంటారని కవిత స్పష్టంచేశారు. ఆసరా పింఛన్లు రానున్న ఐదేండ్లలో రూ.5వేలకు పెరుగుతాయన్నారు. పేదలపై భారాన్ని తగ్గించడానికి రూ.400కే గ్యాస్ సిలిండర్ ఇవ్వాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారన్నారు. యువకులకు జాబ్‌మేళాలు నిర్వహించామని, ఐటీ పరిశ్రమలను నిజామాబాద్‌కు తీసుకొచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని స్పష్టంచేశారు. ఎన్నికలున్నా, లేకున్నా ప్రజల కోసమే బీఆర్ఎస్ పనిచేస్తుందన్నారు.



## జన హారతి

**అభివృద్ధి,** సంక్షేమమే అస్త్రాలుగా ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డికి బాన్సువాడ నియోజకవర్గం జనహారతి పడుతున్నది. ఊరూరా మహిళలు మంగళహారతులు, బోనాలతో తరలివచ్చి సాదరంగా ఆహ్వానిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న ర్యాలీలు విజయోత్సవ ర్యాలీలను తలపిస్తున్నాయి.



స్పీకర్‌కు మద్దతుగా ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న పీఎస్ఆర్ గ్రామస్తులు

## మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్



ఎన్నికల పరిశీలకుల సమక్షంలో మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపడుతున్న కలెక్టర్, సిబ్బంది

కామారెడ్డి, నవంబర్ 11 : ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్‌ను శనివారం పూర్తిచేశారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఐసీ సమావేశ మందిరంలో సాధారణ పరిశీలకులు చిఫంగ్ అర్థర్ వర్చుయియో, జగదీశ్ పర్యవేక్షణలో ఈ ప్రక్రియను చేపట్టారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్‌ను పారదర్శకంగా పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ తెలిపారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాలతోపాటు బాన్సువాడలో కొన్ని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణకు 126 మంది మైక్రో అబ్జర్వర్లు అవసరం కాగా, 29 శాతం అదనంగా ర్యాండమైజేషన్ ద్వారా మొత్తం 164 సిబ్బందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. వారికి సంబంధిత రిటర్నింగ్ అధికారుల ద్వారా ఉత్తర్వులు అందజేసి ఈ నెల 25న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శిక్షణ ఇవ్వనున్నామని కలెక్టర్ తెలిపారు. రెండు లేదా అంతకన్నా ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఒకే ప్రాంగణంలో ఉన్న 126 లొకేషన్స్‌తోపాటు 285 సమస్యాత్మక కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేలా చెక్‌లిస్ట్ ప్రకారం మాక్ పోలింగ్ తదితర కార్యక్రమాలను సూక్ష్మ పరిశీలకులు పర్యవేక్షిస్తారని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో నోడల్ అధికారులు రాజారామ్, రఘునాథ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

